క్లుప్తంగా

మంచినీటి బావిలో చెత్తాచెదారం తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని కొనవాడ పాత పోచమ్మ వద్ద ఉన్న మంచినీటి బావిలో చెత్తాచెదారం పేరుకుపోయి కలుషిత నీటినే సరఫరా చేస్తున్న క్రమంలో 'మంచినీటి బావిలో చెత్తాచెదారం' శీర్షికతో 'సాక్షి 'లో గురువారం ప్రచురించిన కథనానికి పంచాయతీ కార్యదర్శి రంజీత్ స్పందించారు. వెంటనే బావిలోని చెత్తాచెదారాన్ని కార్మికులతో తొలగింపజేశారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. సమస్య పరిష్కారం కావడంతో 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బకాయిల విడుదలకు చొరవ చూపండి



నర్సంపేట : ప్రైవేటు కళాశాలలకు రావాల్సిన ఫీజు బకాయిలు విడుదలకు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ చూపాలని ప్రైవేటు కళాశాలల నిర్వాహకులు జీజుల సాగర్, గోగుల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాధవరెడ్డి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సాగర్, ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. మూడేళ్లుగా ఫీజు బకాయిలు విడుదల కావడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. సమస్యను సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నిధులు విడుదల చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు కళాశాలల నిర్వాహకులు మోర్తాల రాంరాజ్, బోనగాని రవీందర్, తిరుపతి, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బ్యాగ్ అప్పగింత



చెన్నారావుపేట : ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగును ఆటోడ్రైవర్ ఆమె ఇంటికి వెళ్లి అప్పగించాడు. దీంతో ఆటోడ్రైవర్‌ను స్థానికులు అభినందించారు. వివరాలిలా.. మండలంలోని పాపయ్యపేటకు చెందిన నూనె రాకేశ్ ఆటోలో అదే గ్రామానికి చెందిన మరాఠీ కట్టమ్మ గురువారం హ్యాండ్‌బ్యాగ్ మర్చిపోయింది. అందులో రూ.6 వేల నగదుతోపాటు డాక్యుమెంట్లు ఉన్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన ఆటోడ్రైవర్ రాకేశ్ కట్టమ్మ ఇంటికి వెళ్లి హ్యాండ్‌బ్యాగ్ అప్పగించాడు.

ప్రచారాన్ని అడ్డుకున్న జనం

ఖానాపురం : మండలంలోని మంగళవారిపేటలో నిర్వహిస్తున్న ఓ మత ప్రచారాన్ని ప్రజలు అడ్డుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 10 మంది గ్రామానికి వచ్చి పోస్టర్లతో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో పలువురు యువకులు, ప్రజలు ప్రచారాన్ని అడ్డుకుని వెళ్లి పోవాలని సూచించారు. అయినా వినకపోవడంతో వారిని గ్రామం నుంచి వెళ్లగొట్టారు.

బియ్యం అందజేత

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండకు చెందిన పంతంగి ఉప్పలమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్, కరిమిళ్ల దుర్గారావు గురువారం 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పట్టాపురం ఎల్లగౌడ్, భిక్షపతి, పంతంగి వెంకన్న, జుట్టుకొండ నాగన్న, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు మెడిద శ్రీను అమ్మమ్మ ఎరుకల రాజమ్మ గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, నాయకులు వాసం సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్‌ను ఆ పార్టీ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. నర్సింహానాయక్ డెంగీ బారిన పడి కొన్ని రోజులుగా హన్మకొండలోని రోహిణి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన్ను దయాకర్‌రావు కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సుభాశ్‌రెడ్డి, వేణు, రవి తదితరులు పాల్గొన్నారు.

చింతనెక్కొండలో..

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండకు చెందిన దబ్బెట ఉప్పలమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, ఆర్‌ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లం దాస్ కుమార్ పరామర్శించారు. తొలుత ఉప్పలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

అనుభూతి అనిర్వచనీయం

- యువ ఉపాధ్యాయుల మనోగతం
- అత్యధికులు మహిళలే..

నల్లబెల్లి : 'కొత్తగా టీచర్‌గా చేరిక.. చేతిలో చాక్‌పీస్.. ఎదురుగా పిల్లలు.. ఈ అనుభూతి అనిర్వచనీయమైనది' అని తాజాగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు తెలిపారు. జీవిత లక్ష్యాన్ని చేరుకున్న వేళ.. తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలలో పాఠం బోధించిన సమయంలో మనస్సు ఆనంద డోలికల్లో తేలియాడిందని డీఎస్సీ–2024లో ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించిన వారు చెప్పారు. మండలంలో 15 మంది యువ ఉపాధ్యాయులు విధుల్లో చేరగా వారిలో అత్యధికులు మహిళలే కావడం విశేషం. గ్రామీణ ప్రాంతంలో విద్యాకుసుమాలను వెలిగించేందుకు వచ్చిన కొత్త ఉపాధ్యాయుల మనోగతం ఇలా..



నల్లబెల్లిలోని స్కూల్‌లో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

నాన్న కల నేరవేర్చా..



ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. నాన్న స్వామి బీఈడీ పూర్తి చేసి ప్రైవేటు హైస్కూల్ ఏర్పాటు చేశాడు. ఉపాధ్యాయ కొలువు సాధించాలనే నాన్న కల నేరవేరేలా ప్రయత్నించాను. 2016లో జిల్లాకు జీరో పోస్టులు ఉండడంతో నాన్ లోకల్ కోటాలో ఉద్యోగం సాధించలేకపోయా.

-పోకల మౌనిక, ప్రాథమిక పాఠశాల, నల్లబెల్లి

తొలి ప్రయత్నంలోనే..



ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో అభిమానం. పట్టుదల, క్రమశిక్షణతో ప్రయత్నించాను. తొలి ప్రయత్నంలోనే ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించడం గర్వంగా ఉంది. ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు ఇటువైపు మళ్లేలా కృషి చేస్తా. విద్యార్థుల్లో మంచి మార్పు కోసం ప్రత్యేక రవ తీసుకుంటా.

-ధరావత్ పవన్, ప్రాథమిక పాఠశాల, రాంతీర్థం

పట్టుదలతో..



మొదటి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నా. గురువులు విలువలతో కూడిన విద్య నందించడంతోనే మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించగలిగాను. పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేలా బోధిస్తా. ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తూ పేద విద్యార్థులకు బోధించడం అదృష్టం.

-ఉల్లిరావుల అనిత, యూపీఎస్, కొండాపూర్

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



ఖానాపురం : మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీదేవి



చెన్నారావుపేట : నృత్య పోటీలో విద్యార్థినులు



పర్వతగిరి : నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఖానాపురం : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో కళా ఉత్సవ్ మండల స్థాయి క్రీడా పోటీలను గురువారం నిర్వహించారు. సంగీతం, డ్యాన్స్, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్, కథా కథనం వంటి పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ, ఉపాధ్యాయులు హుస్సేన్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పోటీలు నిర్వహించగా ఎంఈఓ లింగారెడ్డి మాట్లాడారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాక రమేశ్‌బాబు, కొంకపాక కాంప్లెక్స్ హెచ్‌ఎం భిక్షపతి, కోఆర్డినేటర్లు డాక్టర్ భాస్కర్, జయరాజు, న్యాయ నిర్ణేతలు శాంతికిరణ్, తిరుమల, రాధాకృష్ణకుమారి, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను వెలికితీసేలా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎలగొండ రామస్వామి, న్యాయ నిర్ణేతలు విజయలక్ష్మి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామంలోని హైస్కూల్‌లో వోకల్ మ్యూజిక్, డాన్స్, విజువల్ ఆర్ట్స్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల మండల కన్వీనర్ మనుపాటి పాపమ్మ మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తేజావత్ జయ, ఉపాధ్యాయులు పోలెపల్లి రవి, అనుపమ, ఎర్ర రవీందర్, శశిధర్, సంతోశ్‌కుమార్, భిక్షపతి, తేజస్విని, పల్లవి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

నర్సంపేట : విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ విమర్శించారు. ఆ సంఘం కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వరంగల్ రోడ్డులో గురువారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో నిరసన ప్రదర్శన నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడారు. మూడేళ్లుగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను ప్రభుత్వం చెల్లించడం లేదని చెప్పారు. జూనియర్, డిగ్రీ కళాశాలలకు పక్కా భవనాలు లేవని ఆందోళన వెలిబుచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో అనేక సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. చలికాలం ప్రారంభమవుతున్న తరుణంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సందీప్, విజయ్, సుష్మంత్, బాలకృష్ణ, ఉష, లావణ్య, కావ్య, దిలీప్, శివాజీ, వివేక్, పవన్, నిఖిత, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లో విద్యార్థుల భవిష్యత్

పర్వతగిరి : విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని ఎంఈఓ గాయపు లింగారెడ్డి తెలిపారు. ఇటీవల నియామక పత్రాలు పొందిన ఉపాధ్యాయులు గురువారం విధుల్లో చేరారు. సంబంధిత పత్రాలను సమర్పించడానికి మండల విద్యా వనరుల కేంద్రానికి వచ్చిన ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. మండలానికి 15 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎంపికవగా 14 మంది విధుల్లో చేరారని చెప్పారు. అంకితభావంతో పని చేస్తూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది శిల్ప, జయరాజ్, సీఆర్‌పీలు ప్రవీణ్, రజిత, శ్రీనివాస్, సుధ, సంధ్య, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

ఖానాపురం : ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య స్పష్టం చేశారు. మండలంలోని అశోక్‌నగర్‌లో గురువారం నిర్వహించిన ఆ పార్టీ గ్రామ శాఖ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీల అమలులోనూ మోసపూరితంగానే వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాసి నియంతృత్వ పాలన తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. పాలకుల తప్పుడు విధానాలపై ప్రజాపోరాటాలు నిర్మించాలని శ్రేణులకు సూచించారు. సమావేశంలో గ్రామ శాఖ కార్యదర్శి కుదురుపాక రాములు, నాయకులు ముంజాల సాయిలు, హన్మకొండ శ్రీధర్, ఈసంపల్లి బాబు, సమ్మయ్య, చింతకింది తిరుపతి, రమేశ్, రాములు, అశోక్, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ

పర్వతగిరి : వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని డాక్టర్ ఉదయ్‌రావు తెలిపారు. వనితా అచ్యుతపాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు వృత్తి విద్యా కోర్సు (ఆన్ జాబ్ ట్రైనింగ్)లో భాగంగా మండలంలోని దౌలత్‌నగర్, అన్నారం పెద్దతండా, రావూరు గ్రామాలను గురువారం సందర్శించారు. ఫీల్డ్ వర్క్‌లో భాగంగా ప్రతిఇంటినీ సందర్శించి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత అలవర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జనార్దన్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు గుంషావళి, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

ఓంకార్ పోరాటం స్ఫూర్తిదాయకం

నర్సంపేట : ప్రజల పక్షాన ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగాల రాగసుధ అన్నారు. ఓంకార్ 16వ వర్ధంతి పక్షోత్సవాల సందర్భంగా పట్టణంలోని అంగడి సెంటర్‌లో ఉన్న ఓంకార్ విగ్రహానికి నాయకులతో కలిసి గురువారం ఆమె పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. నిజాం రజాకర్లు, భూస్వామ్య శక్తుల ఆగడాలపై ఓంకార్ మడమ తిప్పని పోరాటం చేశారని గుర్తు చేశారు. భూస్వాముల చేతుల్లో ఉన్న భూములను పేదలకు పంచడంలోనూ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఓంకార్ స్ఫూర్తితో పాలకుల తప్పుడు విధానాలపై ప్రజాపోరాటాలు నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు మాషుక్, డివిజన్ నాయకులు కర్నె సాంబయ్య, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీమ్ వర్ధంతి

సంగెం : మండల కేంద్రంలో ఆదివాసీల అస్తిత్వ పోరాట యోధుడు కొమురం భీమ్ 84వ వర్ధంతిను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ చిత్రపటానికి ఆదివాసీ తోటి తెగ సేవా సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రం రఘు నివాళులర్పించి మాట్లాడారు. ఆదివాసీ తెగలు దుర్భర జీవితం గడుపుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. రాజ్యాంగబద్ధంగా ఆదివాసీలకు దక్కాల్సిన హక్కులు, అధికారాలు, ఫలాలు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సోయం రాజేందర్, ఉపాధ్యక్షుడు కొడుప మహేశ్, సోమ వెంకటస్వామి, కోశాధికారి సోమ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను వినియోగించుకోండి

సంగెం : ప్రజలు ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరమ్‌సింగ్ కోరారు. గీసుకొండ మండలంలోని బొడ్డు చింతలపల్లికి ఆర్డినరీ బస్సు సర్వీస్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామానికి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు బస్సు నడుపుతామని చెప్పారు. కార్యక్రమంలో కూనమల్ల బాస్కర్, దోపతి రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కల్యాణి, ఏపీఓ చంద్రకాంత్, మాజీ ఉపసర్పంచ్ కేదాసి శోభ, పురం లక్ష్మి, సమ్మక్క, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త నోములకు అవకాశం

సంగెం : దీపావళి పండుగ సందర్భంగా ఈసారి కొత్తగా కేదారేశ్వర వ్రతం (నోము) చేసుకునేందుకు అవకాశం ఉంది. ఈ మేరకు మండల కేంద్రంలోని సంఘమేశ్వరాలయ పురోహితుడు అప్పె నాగార్జున శర్మ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పడిపోయిన, పంచుకుని పోయే నోములు ఈనెల 31న మధ్యాహ్నం 3 గంటల వరకు నోముకోవచ్చని తెలిపారు. ఏటా నోచుకునే వారు మాత్రం రాత్రి వరకు నోముకోవచ్చని వివరించారు.

చర్యలు తీసుకోవాలి

నర్సంపేట : కులం పేరుతో దూషించి, దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ ప్రతినిధి కల్లెపల్లి ప్రణయ్‌దీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సిటిజన్ క్లబ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లికి చెందని స్వరూప పట్ల రాజిరెడ్డి అమానుషంగా ప్రవర్తించాడని, నల్లబెల్లి మండలం కన్నారావుపేటకు చెందిన గణేశ్, అశోక్, రాజేశ్‌లను తరుణ్, సహదేవ్ కులం పేరుతో దూషించారని చెప్పారు. నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు సిద్ధూ, అనిల్, కమల్, నరేశ్, దినేశ్, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, సరుకుల పంపిణీ

రాయపర్తి : మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన ఎర్ర రాజు, అన్వేశ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ నాయక్ రాథోడ్ గురువారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబాల పరిస్థితిని ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి వల్లా సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు స్థానిక సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి సహకారంతో ఎడ్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గురువారం షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడారు. 62 మంది విద్యార్థులకు షూ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



సంగెం : మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన వేల్పుల అనిల్‌ను తెలంగాణ బీసీ ప్రజాసంఘం మండల అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో అనిల్ మాట్లాడారు. బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

సంగెం : మండలంలోని గవిచర్లకు చెందిన గుండు సాంబయ్య ఎంజీఎంలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. సాంబయ్య ఈనెల 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబీకులు ఎంజీఎంలో చేర్చారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

సమర్థవంతంగా సామాజిక, ఆర్థిక గణన



సంగెం : మండలంలో సామాజిక, ఆర్థిక గణనను సమర్థవంతంగా నిర్వహించాలని గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ కృష్ణవేణి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లతో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ కృష్ణవేణి మాట్లాడారు. మండలంలోని 21 గ్రామాల్లో ఉన్న కుటుంబాల వివరాలు, ఆర్థిక స్థితిగతులు, ఇతర అంశాలతో కూడిన సర్వే చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు సిద్ధం కావాలని సూచించారు. సర్వేను పకడ్బందీగా, తప్పులు లేకుండా చేయాలని ఆకాంక్షించారు. మండలంలో 11 వేల 140 కుటుంబాలు ఉండగా సర్వే కోసం 88 మందిని ఎంపిక చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, సూపరింటెండెంట్ కమలాకర్, ఏఎస్ఓ ఉదయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం



రైతులకు సూచనలు ఇస్తున్న ఆనందం, నటరాజ్, తరుణ్‌కుమార్

వర్ధన్నపేట : విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పొలంబాట కార్యక్రమం చేపట్టినట్టు ఆ శాఖ డీఈ ఆనందం, ఏడీఈ నటరాజ్, ఏఈ తరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని దివిటిపల్లి, దమ్మన్నపేట గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు గురువారం పొలంబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ ఆనందం, ఏడీఈ నటరాజ్, ఏఈ తరుణ్‌కుమార్ మాట్లాడారు. రైతులకు విద్యుత్ సరఫరాలో అవాంతరాలు, వ్యవసాయ లైన్లలో ఇబ్బందులు, తదితర సమస్యలను అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించనున్నట్టు తెలిపారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమస్యలను పరిష్కరించి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతున్నట్టు వివరించారు.

చీడపీడల నివారణకు జాగ్రత్తలు పాటించాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏఈ వీరభద్రం

రాయపర్తి : ప్రస్తుత వానాకాలంలో పంటల్లో చీడపీడల నివారణకు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) గుమ్మడి వీరభద్రం కోరారు. మండలంలోని కొండూరు, రాగన్నగూడెం తదితర గ్రామాల్లో వరి, పత్తి పంట క్షేత్రాలను గురువారం సందర్శించి పరిశీలించారు. అనంతరం రైతులకు సూచనలు చేశారు. అధిక విస్తీర్ణంలో ఉన్న వరి, పత్తి పంటలను వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో చీడపీడలు ఆశించే అవకాశం ఉందన్నారు. వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు వ్యాప్తి నివారణ కోసం కాపర్ హైడ్రాక్సైడ్ 400 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, 60 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. తొలి దశలో తెగులును గుర్తిస్తే నత్రజని ఎరువును తాత్కాలికంగా ఆపాలని చెప్పారు. ఆఖరి దఫా పొటాశ్ వేయాలని తెలిపారు. సుడిదోమ, పండాకు, తదితర తెగుళ్ల నివారణకు అధికారుల సూచన మేరకు పిచికారీ చేయాలన్నారు. పత్తి పంటలో నీరు నిల్వకుండా కాల్వలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. నీరు నిల్వ ఉంటే మొక్కలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. వానాకాలంలో ఏరిన పత్తిని బాగా ఎండబెట్టి తేమ శాతం ఖచ్చితంగా 8 నుంచి 12 శాతం ఉండేలా చూసుకొని విక్రయించాలని తెలిపారు.

చట్టాల అమలుతోనే సాధికారత

- ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల

నర్సంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తేనే మహిళా సాధికారత సిద్ధిస్తుందని ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల స్పష్టం చేశారు. నర్సంపేటలో ఆ సంఘం పట్టణ నాయకురాలు బిట్ర స్వప్న అధ్యక్షతన గురువారం నిర్వహించిన మహాసభకు రత్నమాల అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత పేరుతో చేసిన వాగ్ధానాల అమలులో విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మనువాద భావజాలంతో మహిళా హక్కులను కాలరాస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. రాజకీయ, సామాజిక రంగాల్లో మహిళలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తే సాధికారత దిశగా అడుగులు పడతాయని చెప్పారు. మహిళలపై హింసను అరికట్టాల్సిన ప్రభుత్వాలు రక్షణ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళలు చట్టాలు, సమాజంలోని సమస్యలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. మహాసభలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు గుజ్జుల ఉమ, నాయకులు ఫరీదా, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో అర్హులను ఎంపిక చేయాలి

పర్వతగిరి : గ్రామసభలో ఇందిరమ్మ కమిటీకి, ఇళ్లకు అర్హులను ఎంపిక చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఎంపీడీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ వెంకటస్వామిలకు గురువారం వినతిపత్రాలు అందజేసింది. అనంతరం రాజేశ్వర్‌రావు మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్‌కు చెందిన వారిని మాత్రమే ప్రతిపాదించడం సరికాదన్నారు. ప్రస్తుత కమిటీలను రద్దు చేసి కొత్తగా ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కమల పంతులు, రైతుబంధు మండల కోఆర్డినేటర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మాలతి సోమేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీలు రాజు, తదితరులు పాల్గొన్నారు.